
కె.కె. రఘునందన్
Bali

మనసెప్పుడూ ఒకేలా వుండదు. ఆనందాలు అంచులు దాటిన సమయాన ఉల్లాసపూరితంగా, మనో వికాశంతో పరిమళిస్తుంది. వ్యధలు వడగాడ్పుల్లా వీచినప్పుడు వ్యాకులంతో వడిలిపోతుంది. అటువంటి సమయంలో మనసులో వర్ణించ నలవికాని విషాదం గూడు కట్టుకుంటుంది.

అచ్చం అలాగేవుంది అరుంధతమ్మ మనసుఅశాంతిగా.

అన్యమనస్క అయిన ఆమె కళ్ళు అవిరామంగా వర్షిస్తున్నాయి. ఆమె కిటికీ ఊచల్ని పట్టుకుని బయట ఒంటరిగా కూర్చొన్న భర్త ముకుందాన్ని చూస్తూంది. భర్తను చూస్తున్న కొలదీ అరుంధతమ్మ గుండెల్లో- రేగినపుండు చందాన- బాధ. దీర్ఘతరమౌతున్నది.

"ఛీ! కొడుకు, కూతురు ఎంత దారుణంగా వ్రాసారు. ఇప్పటికిది ఎన్నో సారో?! నిర్మల హృదయుడైన తన భర్తను వదిలిపెట్టి ఒక్క క్షణం తనుండగలదా? తన జీవితకాలమంతా భర్త సన్నిధిలోనే వెళ్ళదీయాలన్న తన తపనను అర్థం చేసుకొనకుండా- మాటిమాటికీ గుండు సూదుల్లాంటి మాటలతో, విషపు శరాల్లాంటి ఎత్తి పొడుపులతో, తన గుండెను తునాతునకలు చేస్తున్నారు?!

మనుషుల మనసుల్లోని నైచ్యం స్వార్థంతో అమరిస్తుంది. ఆ స్వార్థం మనిషిని నిలువునా కబళిస్తుంది. గుండెని బండలా మారుస్తుంది.

వీళ్ళు తన కన్నబిడ్డలు కారు...జీవమున్న బండరాళ్ళు.

కొడుకు గోపి- కూతురు బృంద వ్రాసిన ఉత్తరాల్లోని సారాంశం పూర్తిగా అవగాహన చేసుకున్న తదుపరి అరుంధతమ్మలో ఆర్ణవంలాంటి ఆవేదన పరుచుకుంది.

ఒకప్పుడు తను – తన భర్త వాళ్ళని కంటికి రెప్పల్లా చూసారు.

చదివించడానికి నానా యాతనలు పడ్డారు.

కట్నం పోసి బృందకు పెళ్ళి చేసారు.

లంచం యిచ్చి గోపినో వుద్యోగస్తుడ్ని చేసారు.

తన భర్త ఎక్కువగా చదువుకోకపోవడం వల్ల ఎక్కువ సంపాదన పరుడు కాలేదు. ఆ అసమర్థత కన్నబిడ్డల కళ్ళబడకుండా- ఆ లోటును తనే భర్తీ చేసింది. బాధ్యతల్ని నెరవేర్చింది.

అయినంత మాత్రాన తాము కన్నందుకు- వాళ్ళ ఆలనాపాలనా చూసినందుకు, –తల్లిగా తననొక్కర్తినేకాని- తండ్రిగా ఆయనను గౌరవించనక్కర్లేదా!

ఎంతసేపూ- తన నొక్కదాన్ని వాళ్ళ దగ్గరకు రమ్మనడమే కాని- "మీరిద్దరూ రండి...." అని ఏ ఒక్కసారైనా వ్రాసారా?

దానికి ఎన్నిసార్లు ఆయన ఎనలేని బాధను అనుభవించలేదు!

"ఔను అరుంధతీ! వాళ్ళ ప్రవృత్తి సహజమే! కారణం– నేను ఏ డిగ్రీలు పొందిన పెద్ద ఆఫీసరుని కాను.... వాళ్ళని రాజుల్లా పెంచలేకపోయాను.... నేను కూలీగానే సంపాదించాను. నాకన్నా నువ్వే వాళ్ళ బరువు బాధ్యతల్ని మోసావు...." అంటూ విలవిల్లాడేవారు.

అది చూసి తనెంత చలించిపోయేదో...?

ఎంత కదలిపోయేదో?!

"ఏమండీ! వాళ్ళు అలా అన్నంత మాత్రాన మీరు అసమర్థులైపోతారా? మీరు కూలీగా వుండటం వాళ్ళకు ప్రెస్టేజ్ క్వశ్చన్ కావచ్చు. మీరంటే చిన్నప్పట్నుంచీ వాళ్ళకెందుకు ఏవగింపు కల్గిందో నాకే తెలీదు. అయినా మీదీ-వాళ్ళదీ తండ్రీ బిడ్డల అనుబంధం... అది ఎంతో తీయనైనది.... పవిత్రమైనది...." అని ఆయనలోని నిబిడీకృతమైన చింతను తీర్చి నైర్మల్యపరిచేది.

అరుంధతమ్మలో ఆలోచనల పరంపర..

ఒక్కసారి కళ్ళను చెంగుతో అద్దుకుని- గోపి వ్రాసిన ఉత్తరాన్ని మరోసారి చదవటం మొదలుపెట్టింది.

"అమ్మా!"

నీ కొడుకు గోపి వ్రాయునది. ఉభయకుశలోపరి. నీకిదివరకు చెప్పిన విషయాన్నే మరలా వ్రాస్తున్నాను. మేమిక్కడ రాజభోగాలు అనుభవిస్తుంటే నువ్వక్కడ ఒక్కర్తివి ఎంతకాలం వుంటావు. ఆయన పంచన పస్తులతో పడుకోవటం నాకు నచ్చలేదు. ప్రతీ నెలా నీకు యింత పంపుదామన్నా- నా భార్యకు అదిష్టం లేదు, 'అవిడే ఇక్కడకు వచ్చేయొచ్చుకదా!' అంది. మరోవిధంగా అనుకోకు. నువ్విక్కడకు వచ్చేస్తే- ఆయన పాట్లుఅయన పడ్తారు. నామాట విని నాన్నను వదిలి యిక్కడికి రా. ఒంటరిగా వుండేగానీ ఆయనకు కష్టం తెలిసి రాదు. పూర్వం భర్తల్ని వదలి ఒక్కక్షణం ఉండేవారు కారుట. అలా ఛాందసంగా ఆలోచించకు. నా చిన్నప్పుడు నువ్వెంత కష్టాలు పడ్డావో నాకింకా గుర్తే. అదే నాన్న ఏ పెద్ద ఆఫీసరో అయితే మనం ఎలా ఉండేవాళ్ళం. మాకోసం ఏనాడూ నాన్న ప్రాకులాడలేదు. అటువంటి ఆయన కోసం ఎందుకీ ప్రాకులాట? నువ్వు వస్తానంటే డబ్బు ఎమ్. వో. చేస్తాను. వెంటనే రావటానికి ప్రయత్నించు-

ఇట్లు

నీ కొడుకు

—గోపి

అక్కడేవున్న బృంద ఉత్తరాన్ని తీసి చదివింది.

"అమ్మకు- నమస్కృతులు. మేంక్షేమం.... నీవు క్షేమమని తలుస్తాను. నేను మొన్న దసరాలకు వచ్చినప్పుడెంతో చెప్పాను.... కానీ నువ్వింకా మారినట్టు లేదు. భర్తను వదలి వుండలేవా అమ్మా..... ఎందుకాయనతో యింకా వేగు

తావు... చిన్నప్పుడు ఓణీలు కొనమంటే డబ్బులేదని విసుక్కున్న మనిషిపై మాకు మమకారం పోయినా.... నీకింకా పోయినట్లు లేదు..." ఇంక చదవలేక పోయింది.

ఆవేదనాగ్ని శిఖల మయం అరుంధతమ్మ మస్తిష్కం. ఇరువురి ఉత్తరాల్లో భరించలేని కాలకూటంలాంటి మాటలు ఆమె మానసిక చిత్రవధకు హేతువైనాయి.

అయినా వాళ్ళకి తనభర్త ఏమి అపకారం చెయ్యలేదే. మరెందుకు ఈసడించుకోవటం?

పాలివ్వని పశువుని కసాయికి అమ్మమంటానికీ– ఈ ఏదలో ఎంతమాత్రం దారుణత్వంలేదు. అలాగే ఎందుకూ పనికిరాని వాడిగా జమకట్టిన కన్నబిడ్డల సలహాలను పాటించడానికి ఒప్పుకోలేదు తను.

అసలు తన పిల్లల మనసుల్లో తండ్రిపట్ల న్యూనతాభావం ఎందుకు పొడసూపుతోంది?

దానిక్కారణం గతమేమో.


గతించిన గతంలోకి పరుగులు తీసింది మది.

ం ం ం

ఆ రోజుల్లో గుండుపోగుల వెంకట్రామయ్య గారంటే మంచి పేరు- ప్రతిష్ఠలుండేవి. మంచి మర్యాదలకు ఆలవాలమైన కుటుంబం. అటువంటి ఉత్తమ పరివారంలో పుట్టింది అరుంధతి.

అరుంధతిని మంచి వరుడికిచ్చి పెళ్ళి చేయాలని వెంకట్రామయ్యగారి అభిలాష. అయితే ఆయనకు అరుంధతిని మెట్టినింటికి పంపించడానికి మనసొప్పలేదు. అందుకే ఇల్లరికం రావటానికి ఇష్టపడ్డ వాడినే అల్లుడిగా చేసుకోవాలని నిశ్చయించుకున్నారు.

అలా ముందు కొచ్చిన యువకుల్లో ముకుందం అందమైనవాడు. కాని పెద్దగా చదువుకోలేదు. అయినా అరుంధతి అతనిపట్ల ఆకర్షితురాలైంది. ఓ శుభముహూర్తంలో అరుంధతికి ముకుందానికి పెళ్ళి జరిగిపోయింది.



ఇద్దరూ తొలి వైవాహికపు రస ప్రవాహంలో ఓల లాడి పోయారు. అప్పుడే వెంకట్రామయ్యగారి ఆకస్మిక మరణం.

ఒకప్పుడు బాగా బతికిన వెంకట్రామయ్యగారి వెనుక ఆస్తికన్నా అప్పులే అధికం అయినాయి. దాంతో ఉన్న భవ నం అమ్మి- అప్పులు తీర్చారు.

ముకుందం- అరుంధతి- వీధిన పడ్డారు. కొంతమంది వెంకట్రామయ్యగారి సన్నిహితులు- వాళ్ళు వుండటానికి ఇల్లు యిచ్చారు.

అప్పుడు ముకుందానికి- తను చదువుకోక పోవడం వల్ల ఏర్పడిన అసమర్థత తెలిసి వచ్చింది. ఇన్నాళ్ళుగా ఇల్లరికం వలన కులాసాగా సాగిపోయింది. అలా అలా అది సోమరితనానికి దారి తీసింది.

"ఏమండి! మిమ్మల్ని కష్టపడమనటానికి నాకు నోరు రావటం లేదు. కాని నేనైనా పనిపాట్లు చేసి సంపాదిస్తాను. అభ్యంతరం చెప్పకండి." దినం గడవటం దుర్భరం అనిపించి అడిగింది అరుంధతి ఒకసారి.

భార్య అలా అనటంతో ముకుందంమనస్సు చివుక్కుమంది. ససేమిరా యిష్టం లేదు. కాని భార్య వత్తిడి వలన, సంసారపు ఇబ్బందులు ఎదురవటంవలన కాదనలేకపోయాడు

కొన్నాళ్ళు సాగాయి.

అరుంధతి ఒక బిడ్డ తల్లయింది. వాడే గోపి.

గోపి పెరిగి పెద్దవాడవటంతో పాటు- వాడ్ని పెంచటానికి ఆ తల్లితండ్రులకు కూడా సమస్యలు ఎదురైనాయి.

స్కూలు ఫీజులు... ట్యూషన్ ఫీజులు... ఇలా రకరకాల అవసరాలు.... అరుంధతి కష్టపడ్డం చూసి ముకుందం చలించిపోయినా- ఉద్యోగం ఎక్కడా దొరకక పోవటంతో- ఆ బాధను దిగమింగుకున్నాడు.

సరిగ్గా అప్పుడే గోపి మనసులో- తల్లి కష్టపడ్తున్నా తండ్రి ఊరికే కూర్చోవడం తెలిసివచ్చి- న్యూనత్వంఏర్పడింది

జీవితంలో సాధించ వలసిన వాటిన్ని- శ్రమశక్తితో సాధించ వచ్చన్న నగ్నసత్యం ముకుందం మనసులో నాటుకుంది. అందుకే పరువు- ప్రతిష్ఠలకు ఆలోచించకుండా కూలి పనులు చేయసాగాడు.

"అమ్మా. నాన్న బస్టాండులో... పెట్టెలు మోస్తున్నట్టు.... ఛీ.... అటువంటి పాడుపనులు మనం చెయ్యొచ్చా మా బళ్లో గేలి చేస్తున్నారు." అని తండ్రిని అసహ్యంగా అన్నాడు గోపి.

అయినావాడికేం తెలుసు కష్టపడుతున్నది వాడి భవిష్యత్తు కోసమని....

అరుంధతికి తెలుసు భర్త కష్టపడుతున్న విషయం అసలు భర్త కష్టపడ్డం ఆమెకు యిష్టంలేదు. అందుకే వారించింది.

గోపిలో తండ్రిపట్ల చులకన భావం ఏర్పడటానికి మరో కారణం- అతనితోటి సహాధ్యాయుల తల్లితండ్రులు చాలామంది ధనవంతులు పెద్ద పెద్ద ఆఫీసర్లు కాని తన తండ్రిమాత్రం కూలి .. తనేది అడిగినా వెంటనేయిచ్చేవారు....

ఈలోగా బృంద పుట్టింది

అప్పుడు నలభయ్యో పడిలో వున్నాడు ముకుందం.

బృంద స్వతహాగా తిరుగుడు మనిషి. ఫ్రెండ్ సర్కిల్ వల్ల ఎప్పుడూ సినిమాలకు షికార్లకు వెళ్లేది. అది ముకుందానికి నచ్చేదికాదు.

"నువ్విలా పైలా పచ్చీసుగా తిరగటంమంచిది కాదు. వయసులో వున్న ఆడపిల్లవు." ఒకసారి కూతుర్ని మందలించాడు ముకుందం.

"వయసులో కాక- మీలా ముసలైనాక తిరగమన్నారా?" పెడసరంగా జవాబిచ్చింది బృంద.

చెంప చెళ్ళుమనిపించాడు.

దాంతో మరింత పౌరుషం పొగుచుకొచ్చింది.

"ఓణీలు కొనమంటే కొనలేని తండ్రివి. నన్నుకొట్టే అధికారంలేదు." అంది బృంద.

అహం దెబ్బతింది ముకుందానికి.

అలా బృందకు వెగటు పుట్టింది.

ఆ తర్వాత ఎన్నిసార్లు చెప్పినా తండ్రిపై వాళ్లకు సదభిప్రాయం కలుగలేదు. వాళ్ళ పసి మనసుల్లో నాటుకున్న విషాంకురం త్రుంచుకు పోలేదు.

ఉద్యోగం వచ్చిన వెంటనే గోపిని ఓ యింటివాడ్ని చేసారు. తర్వాత ఒక మంచి యోగ్యుడైన వాడికి బృందను ఇచ్చారు.

అలా వాళ్ళు జీవితాల్లో స్థిరపడ్డారు.

అయితే ఎప్పుడు ఉత్తరాలు వ్రాస్తున్నా తన యోగక్షేమాలే కాని తండ్రి గురించి ఒక్క ముక్కైనా వ్రాయకపోవటం అరుంధతమ్మను కలతపెట్టేది. చాలా సార్లుతనని ఆహ్వానించినా- త్రోసిపుచ్చింది.

○ ○ ○ ○

తండ్రి పట్లకన్న బిడ్డల ప్రవృత్తి రాను రాను కౄరతరమౌతున్నందుకు అనంతాంబుధిలో సుడి గుండం సమూహంలా అరుంధతమ్మ మనసు బాధల కెరటాలతో ఎగిసెగిసి పడ్తున్నది.

గతంలోంచి ఇహంలోకి వచ్చేసరికి ముకుందం లోనికి వచ్చాడు. భార్య హృదిలోని కదలికలు ముఖంద్వారా ప్రస్ఫుటమవటంతో-ఓదార్చాడు ఆ ఉత్తరాలపై పడిన కన్నీళ్ళను చూడగానే-సారాంశం బోధపడి పోయింది.

"అరుంధతీ! నేను చేసుకున్న పాపం ఇది, పిల్లలు లేరని బాధపడేవాళ్ళు లోకంలో చాలామంది. కాని పిల్లలున్నా వారి ఆదరణకు. ఆప్యాయతలకు నోచుకోని వారు నాలా

క్రొద్దిమంది, భర్తలా అనడంతో ఆమెలో మరింత దిగులు చోటుచేసుకుంది"

నిజంగా తన భర్త దేముడే!

తనని ఛీత్కరించుకుంటున్న కన్నబిడ్డలపట్ల యింత మృదుప్రవృత్తి అనితరసాధ్యం"

ఇటువంటి సహృదయత్వంగల భర్త సాన్నిధ్యాన్నే తను వాంఛిస్తుంది, అందుకే కొడుకు, కూతురు ఆహ్వానాన్ని మన్నించలేదు.

అరుంధతమ్మ ఆలోచనా స్రవంతి నుండి తేరుకుని గోపి-బృందలకు తను రాలేనట్లు ఎప్పటిలాగే జవాబు వ్రాసింది. సంక్రాంతికి రమ్మని వ్రాసింది కూడా...

○ ○ ○

సంక్రాంతి వచ్చింది.

ఊరంతా సందడిగా-ఉరకలేసే జలపాతంలావుంది.

అరుంధతమ్మ ఇల్లంతా రమ్యంగా తీర్చి దిద్దింది-

పండుగకు అందరూ వచ్చారు.

ముకుందం ఎదురింటివీధి అరుగుమీద-రిటైరైన వాళ్ళంతా పేకాట ఆడుతూంటే సరదాగా చూస్తూ కూర్చున్నాడు.

భోజనాలు అయినాయి.

గదిలో, బృంద-అల్లుడు శశికాంత్?

గోపి-కోడలు:రాధ,

క్యారమ్స్ ఆడుకుంటూ-మధ్యమధ్య ఏదో జోక్సు-వేసుకుంటున్నారు.

అరుంధతమ్మ సావిట్లో కూర్చుని వింటుంది. ఆమె మనసు మాత్రంగిరికలు కొడుతుంది వచ్చినదగ్గర్నుంచీ. తండ్రిని పలకరించాలన్న కనీస జ్ఞానమన్నా లేక పోవడం ఆమెకు కష్టమనిపించింది.

ఈలోగా తల్లిని పిలిచాడు గోపి.

లోనికి నడిచింది అరుంధతమ్మ.

"అమ్మా! ఇలాకూర్చో! నీకు, నేను చెల్లి, చాలా సార్లు మనవి చేసాం-మా దగ్గరకు రమ్మన్నాం, కాని నువ్వు రాననే అంటున్నావు, ఎందుకని అడిగితే భర్త విధేయురాల్లా-ఆయన్ని వదిలి రాలేనన్నావు నీ సమాధానం మాకు ఎంత మాత్రం నచ్చలేదు." అన్నాడు గోపి.

ఈలోగా బృంద— "అసలు నీకెందుకమ్మా ఆయనంటే అంత అపేక్ష!" అంది విసుగ్గా.

"అవునత్తయ్య, ఇప్పుడుఫారిన్ కంట్రీస్‌లో అయితే కాంట్రాక్టు మేరేజస్ చేసుకుంటున్నారు, ఐదేళ్ళో, ఆరేళ్ళో కలసి ఉండటానికి అగ్రిమెంటు చేసుకుంటారు. ఈలోగా అరమరికలొస్తే- విడాకులు పొందటం మామూలైపోయింది వాళ్ళకి. త్వరలో ఈదేశంకి కూడా అది పాకుతుందేమో. ఇంతనాగరికత పెంపొందుతున్నా పంటింటి కుందేల్లా ఆలోచిస్తు భర్తను విడవలేని మిమ్మల్ని చూస్తుంటే ఎంతో జాలి

కలుగుతోంది" అట్టాగే మోడరన్‌గా అలంకరించుకున్న కోడలు రాధ.

"ప్రొద్దున్ననగా వచ్చాం... ఇప్పటికి మా కళ్ళు బడలేదు.... ఈ మధ్య పేకాట జబ్బు కూడా అంటినట్టుంది.... ఛీ! ఏం-మనిషో ఏమో!" అన్నాడు అల్లుడు కాస్త వ్యంగ్యంగా.

అరుంధతమ్మకు వాళ్ళ మాటలు కంటకాల్లా గుచ్చుకుని బాధించాయి.

"అయినా ఆయనకు ఎక్కడ విలువుంది కనక?

ఇంట్లో ఉందా? సంఘంలో వుందా? అటువంటి విలువలేని వ్యక్తికోసం- నువ్వు పడరాని పాట్లుపడుతున్నావు. పైగా మేం రమ్మన్నా రానని మొండికేస్తున్నావు. మనిషికి డబ్బుంటే విలువ.... పదవుంటే విలువ.... ఉన్నతమైన మనసుకి విలువ...

కాని.... నాన్న ఏవిషయంలో విలువమ్మా.... చెప్పు.... చెప్పమ్మా! నిగ్గదీసి అడిగాడు గోపి.

అరుంధతమ్మ- కొడుకు తన నలా అడుగుతున్నందుకు- కళ్ళంట అశ్రువులు రాల్చిందే తప్ప- మూగ వేదన అనుభవించిందే తప్ప- నిరుత్తరురాలైందే తప్ప- ఏమీ చెయ్యలేకపోయింది.

ఆసమయములో బయటనుంచి ఎవరో పిలిచినట్లై వెళ్ళింది. ఒకపదిమందిగాకా పునిస్త్రీ పడుచులువచ్చారు.

"అరుంధతమ్మగారూ బాగున్నారా? మా సునీతకు సీమంతం.... ఈ సాయంత్రం ఆరుగంటలకు.... మీరే పెద్ద ముత్తయిదువుగా మొట్టమొదట ఆశీర్వదించి అక్షింతలు వేయాలి. తప్పకుండారావాలి." అందులో ఒక పెద్దావిడ అరుంధతమ్మను పలకరించి- నుదుట కుంకుమ బొట్టు పెట్టింది. పళ్ళెంలో పసుపు కుంకుమలు ఉంచింది.

వస్తామనిచెప్పి వెళ్ళిపోయారు వాళ్ళు.

పళ్ళెంలో పసుపు-కుంకుమల్ని పట్టుకుని గదిలోనికి నడిచింది అరుంధతమ్మ.

అందరూ ఆమెవైపే దృష్టినిలిపారు.

"మీ అందరు అడిగిన ప్రశ్నలకు నేనిప్పుడు జవాబు చెప్పదలచుకున్నాను....ఇంతవరకూ మీ మాటలు నన్ను బాధించినా గుండెను ఉగ్గబెట్టుకొని వున్నాను. అయితే ఇప్పుడు జవాబు చెప్పవలసిన అవసరం ఏర్పడింది. ఇన్నాళ్ళూ మీరెంత పిలిచినా రాలేదు. దానిక్కారణం-నా భర్తను వదిలి రాలేక పోయానే తప్ప మీపై మరో భావం కాదు, అయితే నాకొక విష ం అవగాహన అయింది. మీరు నన్నొక్కర్తినీ పిలిచారే తప్ప మీ తండ్రిని ఏనాడైనా అనురాగంగా పిలిచారా? చిన్నప్పుడెప్పుడో ఆయనలోని సాధుత్వం పట్టుకుని-అసమర్థుడనే నిందను వేస్తూ-పదేపదే వేలెత్తి చూపిస్తున్నారు. మరో విషయం నాకు విడ్డూరంగా తోస్తూంది. మీ తండ్రి విలువలేని వాడని అనటానికి మీకు

నోరెలా వచ్చింది? నేనా విలువ తక్కువ మనిషి పంచన ఎందుకు బ్రతుకుతున్నానని మీ సందేహం? అసలాయన విలువను నిర్ణయించే సంపూర్ణ పరిజ్ఞానం ఉంటే-ఆయనను మీరంతగా ఈ సడించుకునే వారుకాదు.

అందుకే మీకు ఈక్షణం వివరిస్తున్నాను!

వివాహ సమయంలో వరుడు 'నాతిచరామి' అని ఎందుకు పటిష్ఠ వంతమైన ప్రమాణం చేస్తాడు? సుఖంలో కాని దుఃఖంలోకాని భార్యతో కలసి మెలసి జీవించటానికి.

అలాగే నా భర్త కూడా నాకు కలిమిలేముల్లో సైతం విడనాడకుండా అనుబంధంతో తోడు నీడై నిలిచాడు, అటువంటి దైవంలాటి భర్త పరిస్థితి ఎటువంటిదైనా ఆతనితోటిదే జీవితమని నమ్మకోవటం సహధర్మచారిణిగా నా ధర్మం...కర్తవ్యం.

వృద్ధాప్యంలో వున్నాం భర్తతోఉన్న ఊర్లోనే కలసి మెలసి కలోగంజో త్రాగి బ్రతకటంలో కలిగే విలువ, సంతృప్తి-మీరు నన్ను ఆహ్వానించి, నాకోసం కల్పిస్తామంటున్న స్వర్గతుల్య సౌఖ్యాల వలన కల్గదు. ఇది పచ్చి నిజం....

ఎవరేమనుకున్నా భర్తనాకు సర్వస్వం....చదువుకున్న మీకు ఇంక చెప్పక్కర్లేదు," అనేసింది అరుంధతమ్మ

"అమ్మా. ఇంతకాలం ఎంతో మూర్ఖుల్లా ప్రవర్తించామమ్మా. ఆయన విలువని గుర్తించలేక పోయామమ్మా"

ఒక్కసారి పశ్చాత్తాపంతో దహించుకు పోతూ తల్లి చేతులు పట్టుకుని అన్నాడు గోపి.

రాధ క్షమించమన్నట్టు చూసింది. కళ్లతడిఔతూంటే.

"అమ్మా. నేను నిన్ను అనేకమైన మాటలతో, చిత్రవధ చేసానమ్మా. దీనికి నువ్వేశిక్ష వేసినా సిద్ధమేనమ్మా."

బృంద తల్లి పాదాలపై పడి విలపించింది.

శశికాంత్ ఆ దృశ్యంచూసి చలించి పోయాడు.

అందరిలో ఒకే సారి పరివర్తన కల్గటం నిజంగా 'ఆనందదాయక మని పించింది అరుంధతమ్మకు.

అందుకే ఆమె నయనాలలో హర్షభాష్పాలు నర్తించాయి.

## సమాప్తం

"మీకు! స్క్రీన్ బాగా కనబడుతుందా ?"

"ఓ ! బ్రహ్మాండంగా కనబడుతోంది."

"సీటు మెత్తగా, జరగకుండా, మేకులు వగైరా గుచ్చుకోకుండా బాగుందా ?"

"అద్భుతంగా ఉంది."

"ఎదుటివాళ్ళ తలకాయలు అడ్డుపడటం లేదు కదా ?"

"ఏమాత్రం లేదు"

"అయితే మనిద్దరం సీట్లు మార్చుకుందామా ?"